# ఫంక్షన్

-వేణూ సంకోజు

ఇంకెవరైనా పిలిచి వుంటే ఆలోచించేవాడిని. కాని పిలిచింది శ్రీధర్. శ్రీధర్‌ని ఎట్లా కాదనగలను? అనారోగ్యంగా వున్నా, జ్వరం కాస్తున్నా వెళ్లి రావాల్సిందే. బయలుదేరాను. నూట నలభై కిలోమీటర్లు ప్రయాణం చేయవలసిందే. తప్పదు. ఇదేమంత పెద్ద పండుగ కాదు. అరుదైన వేడుక అంతకన్నా కాదు. వెళ్ళకపోతే కొంపలేమీ అంటుకుపోవు. కాని, గౌరవం- అతడి పట్ల, అతడి తీరు పట్ల, అతడి భావాల పట్ల, కార్యాచరణ పట్ల.

శ్రీధర్‌కి ఒక్కతే కూతురు. ఫ్యామిలీ ప్లానింగ్ చేయించుకున్నారు. అమ్మాయి సాధారణంగా వుంటుంది. ఆకర్షణీయమైన కళ్యా గట్రా ఏమీ వుండవు. ఫలానా రోజు మా డాటర్ బర్త్‌డే. మాధవ్ నీవు తప్పక రావాలి. ఎక్కువ మందినేమీ నేను పిలవడం లేదు. ఫంక్షన్‌లో ఆర్భాటాలేమీ వుండవు. ఆర్భాటాలు నాకు నచ్చవు అనేకంటే నాకా స్తోమత కూడా లేదనేదే సిసలైన సత్యం అంటూ ఫోన్ పెట్టేశాడు శ్రీధర్.

ఫ్రాంక్‌గా మాట్లాడటం, నిక్కచ్చిగా వుండటం, అట్లా అని చాలా కఠినంగా కాకుండా మృదువుగా వుండటం, చల్లని-మెల్లని నవ్వును పెదాల మీంచి జారిపోనివ్వకుండా కాపాడుకోవడం శ్రీధర్ విలక్షణత్వం.

కండక్టర్ టిక్కెట్టు గురించి అడగటంతో ఆలోచనల్లోంచి కాస్త లోకంలోకొచ్చాను. ఏం చేసినా, ఎక్కడెక్కడికి వెళ్ళినా తిరిగి మన లోకంలోనే కదా మనం వచ్చి వాలేదంటూ చాలా సింపుల్‌గా ఆరాతీస్తాడు శ్రీధర్. అతడు వేదాంతి కాని నిర్వికల్పునిలా, సన్యాసి కాని సాధువులా, సనాతనుడైన ఆధునికునిలా తోస్తాడు. తనకు నచ్చిందేదో అలవోకగా, నిస్సందేహంగా చేస్తాడు. పుస్తకాలు విరివిగా చదువుతాడు. ఐదారు భారతీయ భాషలు ఇష్టపడతాడు. ఇవి చాలవన్నట్లు ఫ్రెంచొకటి. అన్నింటికన్నా ఫ్రెంచి మద్యం గొప్పదని చదివిన తొలి రోజుల్లో మద్యం బాగానే సేవించేవాడు. వన్ ఫైన్ మార్నింగ్ హఠాత్తుగా దాన్ని మానేశాడంటే తిరిగి ఎన్నడూ ఇక దాని జోలికి పోలేదు.

ఫంక్షనంటే మాధవ్- పార్టీ గట్రా వుంటుందనుకునేవ్. అదేమీ లేదు. "స్వాదిష్ట ఏవం పౌష్టికారక్ భోజన్" తప్ప మరేమీ వుండవు. అట్లా అని రావటం మానేసేవ్. నీక్కూడా అవేవీ అంతగా రుచించవని నాకు తెలుసు. నీవు రావటం మాత్రం జరగాలి అని గట్టిగా కోరాడు శ్రీధర్.

శ్రీధర్ మాటలో మెత్తగా శాసించే గట్టితనం, ఇట్టే అంగీకరించే భోళాగుణం వున్నాయి ఏకకాలంలో. అసహనంగా వుంది బస్సులో. ఎంతోసేపు కాలేదు బయలుదేరి. కానీ, చాలాసేపే అయినట్టుగా వుంది. జ్వరం తగ్గేట్టు లేదు. మాత్రలు కరిగాయో లేదో గాని చెమటలు.. ఒకటే చెమటలు! ఉక్కపోతగా వుంది. బండి కన్నా హీనంగా పోతున్నట్లుంది బస్సు. ఒకటా, రెండా.. నూట నలభై కిలోమీటర్లు. పై నలభై కిలోమీటర్ల దూరమైనా కడచినట్లు లేదు బస్సు. ఉండకూడనంత అసహనంగా వుంది. అయినా వెళ్ళాలి, తప్పదు. శ్రీధర్ కోసం దేన్నయినా భరించక తప్పదు.

❖ ❖ ❖

చిన్నప్పటినుండీ శ్రీధర్ ఒకవిధంగా పేదరికాన్ని తింటూ, నంజుకుంటూ గడిపాడు. ఎప్పుడూ తనకన్నా తక్కువగానే మసలుకుంటూ వచ్చాడు. తన స్వతంత్ర ఉనికిని చాటుకునే ప్రయత్నం కాన్షియస్‌గా చేయకుండా లో ప్రొఫైల్‌తోనే మెలుగుతూ వచ్చాడు. తనకు తనదైన విలువ, తగిన స్థానం దక్కలేదని ఎన్నడూ కుమిలిపోలేదు సరికదా కనీసం కోరనైనా కోరలేదు.

నాన్న చిన్నతనంలోనే పోయాడు. అమ్మ- రత్నమ్మ వంట మనిషిగా బతుకీడుస్తూ అతడిని డిగ్రీ దాకా చదివించింది. ఊహ తెలిసినప్పటి నుంచీ తల్లికి సాయపడుతూ, పందిళ్ళలో- పెళ్ళి పేరంటాలలో అమ్మ వంటలు చేసి శ్రమిస్తుంటే, రెక్కల కష్టానికి ప్రతిఫలంగా దక్కిందానితో గడుపుకుపోతుంటే, చూస్తూ, ఆమెకు ఆసాంతం రుణపడి వుంటాననుకుంటూ వచ్చి, తోచిం

## మగ పిల్లలు

మీసాలొస్తే / పెద్ద మనిషయినట్లే!
ఉద్యోగమొస్తే / రెక్కలొచ్చినట్లే!!
పెళ్ళయితే / లేచిపోయినట్లే!!!

-డా॥ రావి రంగారావు

దేదో అప్పుడప్పుడూ రాస్తూ, ఎల్లప్పుడూ చదువుతూ వచ్చాడు శ్రీధర్. కొన్నాళ్లకు జర్నలిస్టుగా స్థిరపడ్డాడు.

జర్నలిస్టుగా వుండటమంటే ఒక ఉద్యోగంలో వుండటంగా అనిపించలేదు అపర్ణకు- శ్రీధర్ ఇల్లాలికి. ఇంకో ఫీల్డు ఎన్నుకొమ్మని పోరుపెట్టుకునేది. నవ్వి ఊరుకునేవాడతడు. రెచ్చిపోయి ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తించేది అపర్ణ. అతడు సహిస్తూ, వీలయితే సముదాయిస్తూ పోయేవాడు. ఫర్నిచరూ, బంగారం అంటూ కోరికల చిట్టా పరిచేదతని ముందు అప్పుడప్పుడు. అవన్నీ సాధ్యంకావని, అలా సాధ్యమైనప్పుడు తప్పకుండా తెచ్చుకుందామనే వాడతడు. ఎందుకు సాధ్యం కావని గొడవ పెట్టుకునేది.

ప్రతినెలా తల్లికి డబ్బులు పంపుతూ వుండేవాడు శ్రీధర్. అలా కుదరదని, ఆమే వచ్చి తమ వద్ద వుండిపోతే ఆర్థికంగా కలిసొస్తుందనేది అపర్ణ. కానీ వచ్చిన రెండు మూడు రోజులకే సొంత వూరికి వెళ్ళక తప్పేది కాదు తల్లికి. తనను చెడ్డదని ప్రచారం చేసేందుకే అట్లా వెళ్లిందనేది అపర్ణ. శ్రీధర్ నుంచి ఎటువంటి స్పందనా వుండేది కాదు. జుత్తు పీక్కున్నంత పని చేసేదామె. 'అలాగా' అంటున్నట్టుగా ఒక అమాయకపు చూపుకు అవకాశమిచ్చేవాడతడు. అయినదానికీ, కానిదానికీ అపర్ణ విసుక్కోవడమే కాక అప్పుడప్పుడు బావురుమంటుండేది. ఆమె కోరికల్ని తీర్చలేకపోతున్నందుకు బాధపడినా, అవి తగనివని సమాధానమిచ్చుకుంటూ పోయేవాడు శ్రీధర్.

పెళ్లయిన రెండో యేడు నుంచే చిన్నపాటి ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగించింది అపర్ణ. శాంతి జెండానే ఊపుతూ వచ్చాడు శ్రీధర్. శాంతించలేకపోయిన అపర్ణ ఒకరోజు ఇల్లు విడిచి వెళ్లిపోయింది. కోపంతో తన తల్లిగారింటికి చేరి వుంటుందనుకున్నాడు శ్రీధర్. తరువాత ఆమె అక్కడికి చేరలేదని, ఎవరితోనే ఇంకోచోట కలిసి వుంటోందని తెలుసుకున్న శ్రీధర్ మ్లానంగా వుండిపోవడం కన్నా ఏమీ చేయలేకపోయాడు.

ఎప్పుడో నెల రెండు నెలల తరువాత మిత్రులకు తెలిపాడు జరిగిన విషయం- చాలా ప్రశాంతంగా, కాస్త గంభీరంగా శ్రీధర్. అవాక్కయ్యాం అందరం. నేనైతే అతడి ముఖంలోకి చూడలేకపోయాను ధైర్యం చేసి. ఆశ్చర్యమేమంటే, మమ్మల్నే ఓదార్చేట్టుగా వున్నాయతని చూపులు!

❖ ❖ ❖

నేను బాత్‌రూంలో వుండగా ఫోన్ అదేపనిగా మోగింది. త్వరత్వరగా స్నానం ముగించుకొని బయటపడ్డాను. ఆశించినట్టుగానే మళ్లీ ఫోన్. లైన్‌లో శ్రీధర్. అతడు చెప్తూండటం ప్రారంభించగానే ఏకకాలంలో ఆశ్చర్యానికి, చనువుకొద్దీ ఒక విధమైన ఆగ్రహానికి గురయ్యాను. 'ఛ- ఏం పని చేశాడితడు" అనుకున్నాను. ఎంత పని చేశాడు- కాదు- ఎంత గొప్ప పని చేశాడితడు' అనుకున్నాను. గొప్ప పని కాక మరేమిటి? 'నేనయితే ఇట్లా చేసి వుండే వాడినా' అని ప్రశ్నించుకున్నాను. కాదని క్షణంలోనే నా మనస్సు చెప్పుకుంది. ఆలోచనల్లో పడ్డాను.

'అదేమిటి మాధవ్ నీ స్పందన లేదు- మౌనం పాటిస్తున్నావు. విచారంగాని ప్రకటించడం లేదు కదా- ఛీ ఇతడితోనా దోస్తానా- అని గాని అనుకోవడం లేదు కదా' అంటూ శ్రీధర్ గట్టిగా అడుగుతూ వుంటే, ఆలోచనల్లోంచి కొంచెం తేరుకునే ప్రయత్నం చేస్తూ, 'లేదు, లేదు' అని ముక్తసరిగా రెండుమార్లన్నది మాత్రం గుర్తు. ఆ తరువాత అతడు మరికొద్ది క్షణాలు మాట్లాడి ఫోన్ పెట్టేశాడు. అయితే, ఆ కొద్ది క్షణాలు కూడా

## 'సంఘర్షణ'

బరువైన నీడలు
భుజాల మీద కెత్తుకుని
అగాధాల రహదారుల్లోంచి
నడిచి వెళుతున్నాను.
అపరిచితుల అడుగుజాడలు కనిపించాయి.
నా పయనం
జన సంచారానికేనని తెలుసుకున్నాను.
మృత్యుహేళ ధ్వనించింది
ఉలిక్కిపడ్డట్లుగా తడిసి ముద్దయిపోయాను.
నడకలో నిద్రలేదు కదా...
నిర్భయంగా కదిలాను.
ముందూ-వెనకా- ఆకాశం మీదా
ఏ అలికిడీ లేదు.
"ఇక్కడ తుపాను వచ్చి చల్లారిపోయింది
మంచు బిందువులు గాయపడి
పూవులన్నీ రాలిపోయాయి
పొంగిన జలపాతాలకు
చైతన్య దీపాలు ఆరిపోయాయి
సుడిగాలుల ప్రతిధ్వనులే వినిపిస్తున్నాయి"

-మండాది గోపీనాథ్

నేను ఆలోచనల్లోనే మునిగిపోయి, అతడు చెప్పిందే మిటో గ్రహించలేకపోయాను.

శ్రీధర్‌కి దగ్గరగా వెళ్లగలిగిన వాళ్ళం- ఇంచు మించు ఆరాధనా భావంతో మసలుకోగలిగిన వాళ్ళం - ముగ్గురు, నలుగురు మిత్రులం వున్నాం. అయితే అతనికి మేం మాత్రమే మిత్రులమా? కాదు. అనేక మంది మిత్రులు, శ్రేయోభిలాషులున్నారు. ఆ మాట కొస్తే మైత్రే అతనికి కరగని, తరగని స్థిరాస్తి. అతడజాత శత్రువు అవునో కాదో గాని శత్రుచ్ఛాయలు కూడా కనిపించవు. అతడెవరితో మాట్లాడినా, ఎవరిని పలక రించినా నింపాదిగా, చిరునవ్వుతోనే అలరారాడు. చేతనైన సాయం చేసిపెట్టినవాడే గాని ఎన్నడూ ఏదీ అర్థించి ఎరుగడు. అయితే, శ్రీధర్ తొలిసారి పరోక్షంగా కోరిన మేరకే నేనూ, మిత్రులం కలిసి ఒక అమ్మాయిని చూసి, ఆమెతో మాట్లాడి, రెండో సంబంధమైనా సరేనన్న ఆమె సమ్మతితో సర్వసన్నద్ధమై వున్నాం. ఈవిడ చాలా బాగుంటుంది. వయస్సును మించిన గాంభీర్యం, హుందాతనం. చురుకైన కదలిక. ఏవిధంగా చూసినా శ్రీధరే ఈమె వల్ల అదృష్టవంతు డౌతాడని అందరం అనుకున్నాం. అదేవిషయం అతడికి చెప్పాం. ఫోన్‌లోనే అతడు బిడియపడి పోయాడు. 'ఇక ఈ సంబంధం పక్కా' అని మేం మురిసిపోయాం.

ఇది జరిగిన కొన్ని రోజులకే మనవాడి నుంచి ఫోన్. ఏమనాలో, ఏవిధంగా స్పందించాలో పాలు పోలేదు. నేనైతే ఒకవిధంగా డిస్టర్బ్ అయిపోయాను. 'ఎందుకు చేసివుంటాడు శ్రీధర్ ఈ పని' అని పరిపరి విధాల ఆలోచించాను. ఎంత ప్రయత్నించినా సమాధానం దొరకలేదు. ఎక్కడో ఈతడిది చెప్పుకోలేని బలహీనత వుండి వుండాలి. కాకుంటే ఇట్లాంటి నిర్ణయం ఎందుకు తీసుకుని వుంటాడనిపించింది. వెం టనే మిత్రులు- రఘు, వేణులతో మాట్లాడాను. వారికి కూడా ఫోన్లు వచ్చాయని, వారు కూడా ఇటువంటి తర్జన భర్జనకే లోనయినట్లు చెప్పారు. అందరం కలిసి వెళ్లి శ్రీధర్‌తో ముచ్చటించి రావాలనుకున్నాం.

❖ ❖ ❖

ఎప్పటిలాగే శ్రీధర్ - ఏమీ జరగనట్టు, సాదా సీదాగా, భోళాగా చిరునవ్వును వాడనీయకుండా, ముఖంలో ఎటువంటి భావమూ ద్యోతకం కానీయ కుండా, ఆశ్చర్యంతో పాటు ఇనుమంత ఆగ్రహానికి లోనవడం మావంతయింది.

ఏం మిత్రమా- ఏమిటి కథ? అడిగాం.

'ఏముంది- నేను తప్పు చేశాను. పొరబాటు తనదే. తిరిగి వచ్చేస్తా"నంది. ఏమనాలప్పుడు నేను? ఛల్! చేసింది చాలు వెళ్ళిపొమ్మనాలి. జరిగిందానికి పశ్చాత్తాప పడుతున్నందుకు లోపలికి రమ్మన్నాను. అంతే' అన్నాడు శ్రీధర్.

ఎలా చేయగలిగావు శ్రీధర్ ఈ పని? నీకామె మీద కొంచెం కూడ కోపం కలగలేదా? దీనిని క్షమిం చడమంటామా? జాలిపడటమంటామా? త్యాగం చేశాననుకుంటున్నావా? అని నిలదీశాం.

"కాదు, మీరనుకుంటున్నదేదీ కాదు. నేనొక సామాన్య- సాధారణ వ్యక్తిని. నాకూ రాగద్వేషా లుంటాయి. అయితే, ఇంతకన్నా ఏం చేయవలసి వుం టుందంటారు? పశ్చాత్తాపంతో తిరిగొచ్చిన భార్యను తిరిగి అగాధంలోకి తోయవలసి వుంటుందా?" అని ఎంతో ఆర్ద్రత నిండిన స్వరంతో అడిగాడు శ్రీధర్.

"భార్య! ఎవరి భార్య? ఎప్పటి భార్య? ఎందుకని వెళ్ళింది? ఎవరితోనో వెళ్ళిపోయిన వాడిని కూడా ఎందుకని వదిలేసింది? తిరిగి ఎందుకు వచ్చింది?" సామూహికంగా ప్రశ్నల పరంపర.

"ఏదో కారణం చెప్పొచ్చు. దానివల్ల ప్రయోజనం ఏమిటి? మరింత మనస్తాపం - ఇంకొంచెం బాధ. అంతేకదా! అడిగి తెలుసుకుని కూడా ఇంతకన్నా చేయగలిగిందేముంది?" తిరిగి ప్రశ్నించాడు శ్రీధర్ కూల్‌గా.

"ఆమె వెళ్లిపోయి మేలు చేసిందని కదా అనుకున్నాం. ఆమెకూ నీకూ వేవ్‌లెంగ్త్ కలవదని కదా అనుకున్నాం. ఆమె ఇష్టాలు, దార్శ్టికం ఏవీ నీకు సరిపడ వని కదా అనుకున్నాం' అడిగాం.

"ఇమ్మెచ్యూరిటీ అని కూడా అనుకున్నాం కదా!' అన్నాడు శ్రీధర్.

ఎవరిది ఇమ్మెచ్యూరిటీ ఇప్పుడు? ఆమెదా? నీదా?-

నాది కూడా కావచ్చు. పశ్చాత్తాపం చెంది వుండక పోతే- ఆమె తిరిగి వచ్చేది కాదు కదా! తిరిగి ఆమె మాత్రం ఎక్కడికి వెళ్లగలదు? ఆమె ఆత్మాభిమానం చంపుకుని కదా తిరిగి వచ్చింది. ఆమెనిప్పుడు ఏమని మాత్రం ఏమిటి ప్రయోజనం?

'ఆమె తెలివిగా నటిస్తూ వుండవచ్చు కదా' అన్నాం మేం.

కావచ్చు. అయినా, ఆమె నటనతో, యథార్థంతో

నాకు పనేమిటి? తనంతట తానే వెళ్లిపోయింది. తనంతట తానే తిరిగి వచ్చింది. తన చర్యలకు తనదైన తర్కం తన వద్ద వుండే వుండవచ్చు. ఆమె స్థాయిలో ఆమె ఆలోచించి నిర్ణయాలు తీసుకుని వుండవచ్చు. అవి ఆమె దృష్టిలో తప్పు కాకపోవచ్చు. మనకవి తప్పుగా అనిపించవచ్చు. ఆమె ఆమెలాగే ఆలోచించి వుండవచ్చు. అందుకే ఆ విధంగా ప్రవర్తించి వుండ వచ్చు. ఆమె తప్పొప్పులు తేల్చి చెప్పగల ఇంగితం మనకు వుంటే వుండవచ్చు కాని, తేల్చి చెప్పే అధికారం మనకు మాత్రమే వుంటుందా? – సాలోచనగా అన్నాడు శ్రీధర్.

"మేమైతే నీలా ప్రవర్తించి వుండగలిగే వాళ్లం కామేమో! కనీసం నా మట్టుకు నేను నీలా ప్రవర్తించి– ఆదరించి వుండేవాడిని మాత్రం కాదు" చాల కఠినంగా అన్నాడు రఘు.

"ఇంకా అమ్మాయి దొరకదేమో, అమ్మాయిని ఇవ్వజూపరేమోనని మనవాడికి అనుమానం వచ్చి అలా ప్రవర్తించి వుంటాడు" అన్నాడు కొంచెం కసిగా వేణు.

అది విని నిరాసక్తంగా, ఒక బలహీనమైన నవ్వు లాంటి ప్రతిస్పందనను కనబర్చాడు శ్రీధర్. అతనిలో ఎటువంటి అసహనమూ ధ్వనించలేదు.

❖ ❖ ❖

సుమారు ఆరు సంవత్సరాల తరువాత తిరిగి వచ్చిన అపర్ణలో ఎటువంటి మార్పూ కనిపించలేదు. ఇల్లు మార్చనందుకు, పెద్ద పోర్షన్‌లోకి మారనందుకు నిలదీసింది. పెద్ద ఇల్లొకటి కట్టనందుకు, కనీసం కట్టిన ఇల్లయినా కొనుగోలు చేయనందుకు గోలచేసిందామె. ఇది జీవితాంతం తప్పని తీరేనని అనుకున్నాడో ఏమో శ్రీధర్– అపర్ణ ఏం చేసినా, ఏమని మాట్లాడినా వినీ వినట్టుండిపోయేందుకు అలవాటుపడ్డాడనిపిస్తుంది చూసేవారికి. ఆమె ఎంత రుసరుసలాడినా నిమ్మళంగా ఆమెతో కాపురం చేశాడు. ఆ దాంపత్య ఫలమే 'సహన'– ఆమె పుట్టినరోజు ఫంక్షనుకే నా ప్రయాణం!

చేతిలో ఒక ఫ్రెంచి పుస్తకం– లుంగీ, బనియన్‌తో సాదాసీదాగా ప్రత్యక్షమై చాలా ఆత్మీయంగా రిసీవ్ చేసుకున్నాడు శ్రీధర్. ఒక రోజు నాతో శ్రీధర్– పెద్ద తాత్వికుడు తరహాలో మాట్లాడుతూ– "ఎప్పటికైనా నేనొకరోజు సడెన్‌గా నీ ముందు మహారచయితగా ప్రత్యక్షమౌతాను మిత్రమా" అని అన్నమాటలు గుర్తొచ్చాయి. ఆ రోజు ఎంతో దూరం లేదనిపించిందెందుకో! ఇంతలోనే, బాగా ఆలస్యంగా వచ్చారేమిటని నిలదీసింది అపర్ణ నన్ను. సహన– బొమ్మలతో ఆటలో మునిగితేలుతూ వుంది. ■

## ఎదిరిచూపు

నీవు ఊరొదిలి పోయినప్పటినుండి
ఊరే వట్టి పోయినట్లైయింది
ఆ పచ్చదనము లేదు
పంటల వెచ్చదనమూ లేదు
నీ ఈలల చప్పుళ్లెక్కడ?
నీ పాటల సవ్వడి ఏది
నేసినా, మోసినా
పూటకెల్లడం కష్టం
రోజు రోజుకు అప్పుల కుప్పలు
ఉరితాళ్లు మందు గుళికలు
పట్టణాలకు వలసలు
నీవు పోయిందే పోకడ
ఒక్కసారన్న వచ్చిపోవైతివి
బతుకుతు బతికిస్తవనుకుంటే
నట్టేట్ల ముంచిపోతివి
నీ రాకకోసం చూసి చూసి
మా కంటి చూపె తగ్గిపోయే
తుపాకి చప్పుడైనప్పుడల్లా
గుండె ఆగిపోయినంత పని
ఉత్తరం రాస్తేనన్న
ఉన్నావనుకుంట కద?
నీ కోసం ఎదిరిచూస్తూ
నిద్రలేని రాత్రులెన్నో
రేపు కొరివి పెట్టేదెవరు?
నీవు ఉయ్యాలలో ఊగుతూ
ఊకొడుతూ నవ్వుతుంటె
ఇంటి దీపం కంటి వెలుగని
అనుకున్నం ఆనందించాము
చదువుల సంచితో బడికిపోతుంటె
ఎంత సంబరపడిపోయేది
మా కలలు ఎటు మాయమాయే
పండగలప్పుడు గుర్తొచ్చి
ముద్ద దిగదు కన్ను మలగదు
ఒక్కసారన్న వచ్చిపో తండ్రి
చచ్చి నీ కడుపున పుడుతం

–డా॥ బోయ జంగయ్య